# చట్టానికి కళ్లున్నాయ్!

### సుప్రీంలో కళ్లకు గంతలు లేకుండా న్యాయదేవత కొత్త విగ్రహం



న్యూఢిల్లీ, అక్టోబర్ 16: 'చట్టానికి కళ్లు లేవు' అన్న అపవాదు నుంచి బయటపడటానికి దేశ సర్వోన్నత న్యాయస్థానం నడుం కట్టింది. ఇప్పటివరకు కళ్లకు గంతలతో కుడి చేతితో త్రాసు, ఎడమ చేతిలో కత్తితో ఉన్న న్యాయదేవత విగ్రహం స్థానంలో కళ్లకు గంతలు లేకుండా, కత్తి స్థానంలో రాజ్యాంగాన్ని చేతబట్టి ఉన్న కొత్త విగ్రహాన్ని సుప్రీం కోర్టులో ఏర్పాటు చేశారు. కళ్లకు గంతలు కట్టడం చట్టం ముందు సమానత్వాన్ని సూచించడానికి ఉద్దేశించినది. వివరంగా చెప్పాలంటే కేసులోని వాది, ప్రతివాదులు సంపద, అధికారం, కులం, మతం ఏవీ న్యాయదేవత చూడదు. అదే సమయంలో అన్యాయాన్ని, అధికారాన్ని శిక్షించే ఆయుధంగా కత్తిని సూచిస్తుంది. అయితే న్యాయదేవత కండ్లకు గంతలను కట్టడంపై చాలాకాలంగా విమర్శలు కూడా ఉన్నాయి. ఆమె నిజాన్ని చూడదని, గుడ్డిదని, చట్టానికి కళ్లు లేవని కొందరు పేర్కొనేవారు. ఈ అపవాదు నుంచి బయటపడటానికి సీజేఐ చంద్రచూడ్ నడుం బిగించారు. ఆయన ఆదేశాల మేరకు సుప్రీం కోర్టులోని జడ్జీల లైబ్రరీలో ఏర్పాటు చేసిన విగ్రహంలో కండ్లకు ఎలాంటి గంతలు లేవు. ఎడమ చేతిలోని కత్తి స్థానంలో రాజ్యాంగాన్ని ఉంచారు. కత్తిలా ఉన్న వలసవాద యుగం నాటి భారతీయ ఇండియన్ పీనల్ కోడ్ లాంటి క్రిమినల్ చట్టాలను విడిచిపెట్టి భారతీయ న్యాయ సంహిత ద్వారా భర్తీ చేయడాన్ని ప్రతీకగా రాజ్యాంగాన్ని ఉంచారు.

# 'మాన్య'గారా వాటర్ ఫాల్స్

బెంగళూరు, అక్టోబర్ 16: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలతో టెక్ హబ్ బెంగళూరు నీట మునిగింది. 300 ఎకరాల్లో విస్తరించి ఉన్న మాన్యత టెక్ పార్కులోకి భారీగా వరదనీరు చేరింది. రోడ్లపై రాకపోకలు నిలిచిపోయాయి. ఉద్యోగులు కార్యాలయాల నుంచి బయటకు రాలేకపోయారు. వరదనీరు జలపాతంలా కిందకు దూకుతున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. వీటికి నెటిజన్లు 'మాన్య'గారా వాటర్‌ఫాల్స్ అంటూ నామకరణం చేశారు.





# తదుపరి సీజేఐగా జస్టిస్ సంజీవ్ ఖన్నా!

### సీజేఐ చంద్రచూడ్ సిఫారసు

కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు తదుపరి ప్రధాన న్యాయమూర్తిగా(సీజేఐ) జస్టిస్ సంజీవ్ ఖన్నా నియమితులయ్యే అవకాశం ఉన్నది. ఈ మేరకు తన వారసుడిగా సంజీవ్ ఖన్నా పేరును సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్టు కేంద్రప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. 2022 డిసెంబర్ 17న సీజేఐగా బాధ్యతలు చేపట్టిన జస్టిస్ చంద్రచూడ్.. నవంబర్ 10న పదవీ విరమణ చేయనున్నారు. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐ పేరును సూచించాల్సిందిగా కేంద్ర ప్రభుత్వం గత శుక్రవారం సీజేఐకి లేఖరాసింది. దీంతో ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రస్తుతం అత్యంత సీనియర్ జడ్జిగా ఉన్న జస్టిస్ ఖన్నా పేరును సీజేఐ సూచించినట్టు సమాచారం.

# ముడా చైర్మన్ రాజీనామా

### భూకేటాయింపు కుంభకోణం నేపథ్యంలో నిర్ణయం

సిద్ధరామయ్య ఆదేశాలతోనే రాజీనామా ప్రకటన



బెంగళూరు, అక్టోబర్ 16: మైసూర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) కుంభకోణంలో కీలక పరిణామం చోటు చేసుకున్నది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య భార్య బీఎం పార్వతికి స్థలాల కేటాయింపులో అక్రమాలు జరిగాయనే ఆరోపణల నేపథ్యంలో ముడా చైర్మన్ కే మరిగౌడ బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో పాటు తన అనారోగ్య సమస్యల వల్ల రాజీనామా చేస్తున్నానని, తనపై ఎలాంటి ఒత్తిడి లేదని ఆయన ప్రకటించారు. ముడా స్కామ్‌పై ఆయన స్పందిస్తూ.. విచారణ కొనసాగుతున్నదని, అక్రమాలు జరిగాయా అనేది విచారణలో తేలుతుందని పేర్కొన్నారు. తాను 40 ఏండ్లుగా సిద్ధరామయ్యతో ఉన్నానని, ఆయనే తనను తాలుకా, జిల్లా పంచాయతీ అధ్యక్షుడిని చేశారని, చట్టవ్యతిరేక పనులు చేయమని ఆయన తనకు ఎప్పుడూ చెప్పలేదని అన్నారు.

**సీఎం పేరు చెప్పాలని ఈడీ ఒత్తిడి**

వాల్మీకి స్కామ్‌లో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ పేర్లు చెప్పాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) తనను ఒత్తిడికి గురిచేసిందని మాజీ మంత్రి బీ నాగేంద్ర ఆరోపించారు. బుధవారం జైలు నుంచి విడుదలైన ఆయన మాట్లాడుతూ 'వాల్మీకి స్కామ్‌లో రాష్ట్ర ప్రభుత్వానికి, సిద్ధరామయ్యకు, డీకే శివకుమార్‌కు, నాకు సంబంధం లేదు. అనవసరంగా ఈడీ ఈ కేసులో ముఖ్యమంత్రిని ఇరికించడానికి ప్రయత్నిస్తున్నది.' అని ఆయన ఆరోపించారు.

## సిద్ధరామయ్య రాజీనామా చేయాలి: బీజేపీ

బెంగళూరు: సీఎం సిద్ధరామయ్య భూ కుంభకోణంలో పూర్తిగా కూరుకుపోయారని, ఆయన తన పదవికి వెంటనే రాజీనామా చేయాలని బీజేపీ ఎంపీ సంబిత్ పాత్ర డిమాండ్ చేశారు. 'ముడా' చైర్మన్ కే మరిగౌడ తాజాగా తన పదవి నుంచి తప్పుకోవటం సంచలనంగా మారింది. బుధవారం న్యూఢిల్లీలో ఎంపీ సంబిత్ పాత్ర విలేకర్లతో మాట్లాడుతూ, 'సీఎం భార్య 'ముడా' భూములు తిరిగిచ్చేయటం, 'ముడా' చైర్మన్ రాజీనామా వంటి అంశాలు పరిశీలిస్తే, సిద్ధరామయ్య కుంభకోణంలో పూర్తిగా కూరుకుపోయారు. 'ముడా' చైర్మన్ తన పదవికి రాజీనామా చేశారు. ఏ మాత్రం నైతికత ఉన్నా సిద్ధరామయ్య కూడా తన పదవిని వీడాలి' అని సంబిత్ పాత్ర అన్నారు.

# మోదీ దౌత్యం ఫెయిల్

- అనేక దేశాలతో దెబ్బ తిన్న భారత సంబంధాలు
- మాటలకే పరిమితమైన 'నైబర్‌హుడ్ ఫస్ట్'
- చైనా గుప్పిట్లోకి వెళ్తున్న పొరుగు దేశాలు
- చుట్టూ భారత వ్యతిరేక ప్రభుత్వాలే
- మిత్రదేశాలతోనూ చెడిన మైత్రి



న్యూఢిల్లీ, అక్టోబర్ 16: కేంద్రంలోని నరేంద్ర సర్కారు దౌత్య విధానం విఫలమైనట్టు కనిపిస్తున్నది. ఇటీవలి కాలంలో అనేక దేశాలతో భారత దౌత్య సంబంధాలు దెబ్బతిన్నాయి. తాజాగా కెనడాతో ఉద్రిక్తతలు మరింత ముదిరాయి. అలాగే పొరుగు దేశాలకే ప్రథమ ప్రాధాన్యం అంటూ మోదీ ప్రభుత్వం తీసుకున్న 'నైబర్‌హుడ్ ఫస్ట్' పాలసీ ఫలితాలనివ్వడం లేదు. పొరుగు దేశాలు క్రమంగా భారత్‌కు దూరమై, చైనాకు దగ్గరవుతున్నాయి. మాల్దీవులు, బంగ్లాదేశ్, శ్రీలంక, నేపాల్‌లో భారత వ్యతిరేక, చైనా అనుకూల శక్తులు అధికారంలోకి వచ్చాయి. మరోవైపు చాలాకాలంగా భారత్‌తో మంచి సంబంధాలు కలిగి ఉన్న ఇరాన్ ఇటీవల విమర్శలు చేసింది. దీంతో పొరుగు దేశాలతో పాటు కీలక భాగస్వామ్య దేశాలతో సంబంధాలు, దౌత్యం విషయంలో మోదీ సర్కారు విఫలమైందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

**శ్రీలంక**

- గత నెల శ్రీలంక కొత్త అధ్యక్షుడిగా అనుర కుమార దిస్సనాయకే బాధ్యతలు స్వీకరించారు. ఆయన భారత వ్యతిరేకిగా, చైనా అనుకూల వ్యక్తిగా ముద్రపడ్డారు. పలు మార్లు భారత్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన నేపథ్యం ఆయనది.

**బంగ్లాదేశ్**

- ఇటీవల దేశంలో భారత, హిందూ వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. భారత అనుకూల వ్యక్తిగా ముద్రపడిన షేక్ హసీనా అధికారాన్ని కోల్పోయారు. భారత వ్యతిరేక శక్తుల చేతికి అధికారం వెళ్లింది.

**మాల్దీవులు**

- మాల్దీవులలో గత ఏడాది భారత వ్యతిరేక ఆందోళనలు జరిగాయి. 'ఇండియా ఔట్' నినాదంతో భారత వ్యతిరేకి, చైనా అనుకూల వ్యక్తి అయిన మహమ్మద్ ముయిజ్జు అధ్యక్షుడయ్యారు. ఆయన భారత వ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారు.

**అఫ్గానిస్థాన్**

- మూడేండ్ల క్రితం పాకిస్థాన్ మద్దతు గల తాలిబన్లు అఫ్గానిస్థాన్‌లో అధికారంలోకి వచ్చారు. అప్పటి నుంచి భారత్ – అఫ్గాన్ సంబంధాలతో పాటు భారత్ చేపట్టిన ప్రాజెక్టులూ నిలిచిపోయాయి.

**నేపాల్**

- నేపాల్ ప్రధానమంత్రిగా కృష్ణ ప్రసాద్ శర్మ ఓలీ(కేపీ శర్మ ఓలీ) ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఆయన భారత వ్యతిరేకిగా, చైనా అనుకూల వ్యక్తిగా ముద్రపడ్డారు.

**ఇరాన్**

- గత నెల ఇరాన్ సుప్రీం లీడర్ అలీ ఖమేనీ భారత్‌పై చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల సంబంధాలను దెబ్బతీశాయి. 'భారత్‌లో ముస్లింలు పడుతున్న ఇబ్బందులను పట్టించుకోకపోతే మనల్ని మనం ముస్లింలు పరిగణించలేం' అని ఆయన వ్యాఖ్యానించారు. దీనికి భారత్ గట్టిగా కౌంటర్ ఇచ్చినప్పటికీ ఇరు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి.

**కెనడా**

- కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో భారత వ్యతిరేక వైఖరి అవలంబిస్తున్నారు. ఇటీవల సిక్కు అతివాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో భారత దౌత్యవేత్తలను అనుమానితుల జాబితాలో చేర్చాలని కెనడా నిర్ణయించడం ఇరుదేశాల మధ్య సంబంధాలను తీవ్రంగా దెబ్బతీసింది.

**భారత్‌కు సమస్యగా మారిన అదానీ వ్యాపారాలు**

ఒకవైపు అనేక దశాబ్దాలుగా భారత్‌కు మిత్రదేశాలుగా కొనసాగిన వాటితో ఇప్పుడు దూరం పెరుగుతుండగా మరోవైపు మన దేశానికి చెందిన అదానీ సంస్థల వ్యాపార విస్తరణ సైతం భారత్‌కు ఇబ్బందిగా మారుతున్నది. బంగ్లాదేశ్, కెన్యా, శ్రీలంక, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో అదానీ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా మొదలైన ఆందోళనలు భారత్‌పై అక్కడి ప్రజల్లో వ్యతిరేకతకు కారణమయ్యాయి.

## టెక్సాస్‌లో ఘోర రోడ్డు ప్రమాదం.. ముగ్గురు ఏపీ వాసుల దుర్మరణం

న్యూఢిల్లీ: అమెరికాలోని టెక్సాస్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏపీకి చెందిన ముగ్గురు సహా మొత్తం ఐదుగురు భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. అమెరికా కాలమానం ప్రకారం ఆదివారం సాయంత్రం రాండాల్ఫ్ సమీపంలో జరిగిందీ ఘటన. ప్రమాదంలో కారులో ఉన్న మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. మృతులను చిత్తూరు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన తిరుమూరు గోపి, శ్రీకాళహస్తికి చెందిన రజిని శివ, హరిగా గుర్తించారు. తీవ్రంగా గాయపడ్డ హరి భర్త సాయి చెన్ను పరిస్థితి విషమంగా ఉంది.

## వీఐపీలకు ఎన్ఎస్‌జీ కమాండో భద్రత ఉపసంహరణ

న్యూఢిల్లీ: దేశంలో 9 మంది హై-రిస్క్ వీఐపీల భద్రత విధుల నుంచి ఎన్ఎస్‌జీ బ్లాక్ క్యాట్ కమాండోలను ఉపసంహరిస్తూ కేంద్రం తాజాగా ఉత్తర్వులు జారీచేసింది. నవంబర్ నుంచి ఆ 9 మంది హై-రిస్క్ వీఐపీల భద్రతను సీఆర్‌పీఎఫ్‌కి అప్పగిస్తున్నట్టు కేంద్ర హోంశాఖ వర్గాలు బుధవారం వెల్లడించాయి. అలాగే, ప్రత్యేక శిక్షణ పొందిన తాజా బెటాలియన్, పార్లమెంట్ భద్రతా విధుల నుంచి పక్కకు తప్పించిన బలగాలను సీఆర్‌పీఎఫ్ వీఐపీ వింగ్‌కు అటాచ్ చేసింది. సీఆర్‌పీఎఫ్, ఎన్ఎస్‌జీ విధుల్లో చేసిన మార్పులు నెలరోజుల్లో పూర్తి అవుతాయని కేంద్రం తెలిపింది.

## నిజ్జర్ హత్యపై భారత్‌కు ఆధారాలు ఇవ్వలేదు

### ప్రభుత్వ విచారణలో కెనడా ప్రధాని ట్రూడో వెల్లడి

ఒట్టావా, అక్టోబర్ 16: ఖలిస్థాన్ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్యకు సంబంధించి కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ హత్యపై భారత్‌కు కచ్చితమైన ఆధారాలు అందజేయలేదని అన్నారు. కెనడా ఎన్నికల ప్రక్రియ, ప్రజాస్వామ్య సంస్థల్లో విదేశీ జోక్యంపై ఒట్టావాలో జరిగిన ప్రభుత్వ విచారణలో ప్రధాని ట్రూడో పై విషయాన్ని వెల్లడించారు. కెనడా భూభాగంపై నిజ్జర్ హత్య.. భారత్ ఏజెంట్ల పనేనని గత ఏడాది ట్రూడో ఆరోపించారు. దీంతో కెనడా–భారత్ సంబంధాలు దెబ్బతిన్నాయి. కేవలం నిఘా సమాచారం ఆధారంగా ఆ ఆరోపణలు చేసినట్టు నేడు ప్రభుత్వ విచారణలో చెప్పుకొచ్చారు.

## ఉత్తర కొరియా ఆర్మీలో వారంలో 14 లక్షల మంది చేరిక

ప్యాంగ్యాంగ్ (ఉత్తర కొరియా), అక్టోబర్ 16: ఒక వైపు దక్షిణ కొరియాతో ఉన్న మార్గాలను పేల్చివేయడం ద్వారా సరిహద్దులను శాశ్వతంగా మూసివేస్తున్న కిమ్ నేతృత్వంలోని ఉత్తర కొరియా ప్రభుత్వం మరో సంచలన చర్యకు తెరతీసింది. ఎప్పుడు యుద్ధం వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా లక్షలాది మంది యువకులను ఆర్మీలో చేర్చుకుంటున్నది. కేవలం ఈ వారంలోనే 14 లక్షల మంది యువత స్వచ్ఛందంగా ఆర్మీలో చేరిక లేదా నమోదు చేయించుకున్నట్టు ఆ దేశ మీడియా కేసీఎన్ఏ వెల్లడించింది. పవిత్ర యుద్ధంలో శత్రువును అంతం చేస్తామని ఈ దేశ యువత ప్రతిజ్ఞ చేసినట్టు తెలిపింది. ఈ సందర్భంగా ఉత్తర కొరియా యువత ఆర్మీలో చేరేందుకు పిటిషన్లపై సంతకం చేస్తున్న ఫొటోలను కేసీఎన్ఏ విడుదల చేసింది. కొరియా ద్వీపకల్పంలో ఉద్రిక్తతల క్రమంలోనే ఈ రిక్రూట్‌మెంట్ చేపట్టినట్టు పేర్కొంది. ఉత్తర కొరియా రాజధాని ప్యాంగ్యాంగ్‌లో దక్షిణ కొరియా డ్రోన్లు చొరబడటానికి ప్రయత్నించినట్టు కిమ్ ప్రభుత్వం ఆరోపించింది. అయితే ఈ ఆరోపణలను దక్షిణ కొరియా ఖండించింది.

# గోధుమకు మద్దతు రూ.150

### 6 పంటలకు కనీస మద్దతు ధరలు పెంచిన కేంద్రం



న్యూఢిల్లీ: 2025-26 మార్కెటింగ్ సీజన్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గోధుమ సహా 6 రబీ పంటల కనీస మద్దతు ధరను (ఎమ్మెస్పీ) పెంచింది. కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఈ విషయం వెల్లడించారు. క్వింటాల్ గోధుమ ధరను రూ.150, ఆవాల ధరను రూ.300, పెసర్ల ధరను రూ.275, శెనగల ధరను రూ.210, పొద్దుతిరుగుడు ధరను రూ.140, బార్లీ ధరను రూ.130 చొప్పున పెంచినట్టు తెలిపారు.

**రబీ పంటల ఎమ్మెస్పీ పెంపు వివరాలు**

| పంట | 2024-25లో క్వింటా | 2025-26లో క్వింటా |
|---|---|---|
| గోధుమ | రూ.2,275 | రూ.2,425 |
| బార్లీ | రూ.1,850 | రూ.1,980 |
| శెనగలు | రూ.5,440 | రూ.5,650 |
| పెసర్లు | రూ.6,425 | రూ.6,700 |
| ఆవాలు | రూ.5,650 | రూ.5,950 |
| పొద్దుతిరుగుడు | రూ.5,800 | రూ.5,940 |

# ఉద్యోగుల డీఏ 3% పెంపు

### జూలై 1 నుంచి అమలు • కేంద్ర క్యాబినెట్ ఆమోదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 16: ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు కేంద్రం తీపికబురు చెప్పింది. దీపావళి కానుకగా కరవు భత్యాన్ని (డీఏ) 3 శాతం పెంచుతున్నట్టు ప్రకటించింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలు నిర్ణయాలను ఆమోదించినట్టు కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడించారు. డీఏ పెంపు ఈ ఏడాది జూలై 1 నుంచి అమల్లోకి వస్తుందని తెలిపారు. దీని వల్ల దాదాపు 49.18 లక్షల మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు, 64.89 లక్షల మంది పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని, కేంద్ర ఖజానాపై రూ.9,448 కోట్ల అదనపు భారం పడుతుందని వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఏప్రిల్‌లో డీఏను 4 శాతం పెంచిన విషయం తెలిసిందే. తాజాగా పెంపుతో ఇది 50 నుంచి 53 శాతానికి చేరుతుంది. మరోవైపు, వారణాసి-పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ్ (డీడీయూ) జంక్షన్ మధ్య రూ.2,642 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న మల్టీ-ట్రాకింగ్ ప్రాజెక్టుకు కూడా కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపింది.



## పెట్రోల్ ట్యాంకర్ పేలి 140మంది మృతి

### నైజీరియాలో ఘోర ప్రమాదం

అబుజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో పెట్రోల్ ట్యాంకర్ పేలి 140 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. మంగళవారం అర్ధరాత్రి జిగావా రాష్ట్రం మజియా పట్టణం వద్ద జాతీయ రహదారిపై ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. ఘటనలో 50 మందికిపైగా తీవ్రంగా గాయపడ్డారని, క్షతగాత్రుల్లో చాలా మంది పరిస్థితి సీరియస్‌గా ఉందని అత్యవసర విభాగం బుధవారం వెల్లడించింది. అనేక మృతదేహాలు గుర్తించలేని విధంగా దెబ్బతిన్నాయని తెలిపింది. మృతుల సంఖ్య 140కు చేరుకుందని, సామూహికంగా అంత్యక్రియలు నిర్వహించినట్టు నేషనల్ ఎమర్జెన్సీ మేనేజ్‌మెంట్ ఏజెన్సీ హెడ్ నురా అబ్దుల్లా చెప్పారు. వాహనంపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవటంతో ట్యాంకర్ బోల్తా పడిందని పోలీస్ అధికార ప్రతినిధి తెలిపారు. ట్యాంకర్ బోల్తా పడ్డ సంగతి తెలిసి, పెద్ద సంఖ్యలో సామాన్య జనం అక్కడికి పరిగెత్తుకు వచ్చారని, ట్యాంకర్ నుంచి కారే ఇంధనాన్ని డబ్బాల్లో పట్టుకునేందుకు ప్రయత్నించారని చెప్పారు. వారు పెట్రోల్‌ను తీసుకుంటున్న సమయంలో మంటలు చెలరేగి, ట్యాంకర్ పేలిపోయిందని తెలిపారు.

## జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రిగా

# ఒమర్ అబ్దుల్లా ప్రమాణం

- ఉపముఖ్యమంత్రిగా సురీందర్ చౌదరి
- ప్రభుత్వంలో చేరని కాంగ్రెస్



శ్రీనగర్, అక్టోబర్ 16: జమ్ముకశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఒమర్ అబ్దుల్లా బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. 2019లో 370వ అధికరణ రద్దు తర్వాత ఏర్పడిన యూటీకి తొలి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఒమర్‌తో పాటు ఐదుగురు మంత్రుల (వీరిలో ఒకరు మహిళ)తో లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ప్రమాణం చేయించారు. వీరిలో సురీందర్ చౌదరి ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేశారు. కాగా, ఎన్‌సీ కూటమిలో భాగస్వామి అయినప్పటికీ కాంగ్రెస్ అధికారంలో భాగం పంచుకోలేదు. ఒమర్ ప్రభుత్వానికి బయట నుంచే మద్దతు ఇస్తామని ప్రకటించింది. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించకపోవడం పట్ల తాము సంతోషంగా లేమని ఆ పార్టీ పేర్కొంది. ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా బాధ్యతలు చేపట్టడం ఇది రెండోసారి. అంతకుముందు ఆయన 2009 నుంచి 2014 వరకు పూర్తి రాష్ట్రంగా ఉన్న జమ్ముకశ్మీర్‌కు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. ఆయన తాత షేక్ అబ్దుల్లా, ఆయన తండ్రి ఫరూక్ అబ్దుల్లా కూడా గతంలో జమ్ముకశ్మీర్‌కు ముఖ్యమంత్రులుగా చేశారు.

**సీఎం పదవి ముళ్ల కిరీటమే**

జమ్ముకశ్మీర్ ముఖ్యమంత్రి పదవి ఒక ముళ్ల కిరీటం లాంటిదని ఎన్సీ అధినేత ఫరూక్ అబ్దుల్లా పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రం అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నదని, ముందుకు వెళ్లే దారంతా పూర్తి అడ్డంకులతో నిండి ఉందని, ఎన్నికల మ్యానిఫెస్టోలో చేసిన వాగ్దానాలను ప్రభుత్వం నెరవేరుస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేర్చే శక్తిని భగవంతుడు ప్రసాదించాలని కోరుకుంటున్నట్టు ఆయన పేర్కొన్నారు.

## హర్యానా సీఎంగా నేడు సైనీ ప్రమాణం

### బీజేపీ శాసనసభా పక్ష నేతగా ఎన్నిక

చండీగఢ్, అక్టోబర్ 16: హర్యానా బీజేపీ శాసనసభా పక్ష నేతగా మాజీ ముఖ్యమంత్రి నాయబ్ సింగ్ సైనీ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం ఆయన హర్యానా సీఎంగా వరుసగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శాసనసభా పక్ష నేతగా ఎన్నికైన అనంతరం ఆయన గవర్నర్ బండారు దత్తాత్రేయను కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. బీజేపీ విజయం సాధిస్తే సైనీయే ముఖ్యమంత్రిగా కొనసాగుతారని ఎన్నికల అనంతరం బీజేపీ ప్రకటించిన విషయం తెలిసిందే. అంతకు ముందు సీఎంగా ఉన్న మనోహర్ లాల్ ఖట్టర్‌ను తొలగించిన బీజేపీ మార్చిలో సైనీని ముఖ్యమంత్రిగా చేసింది. ఆయన నాయకత్వంలో ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 90 సీట్లకు 48 స్థానాల్లో బీజేపీ విజయం సాధించగా, విపక్ష కాంగ్రెస్ 37 సీట్లకే పరిమితమైంది.

## మూడు పురుషాంగాలతో జీవించిన వ్యక్తి

### మరణించిన తర్వాత గుర్తించిన పరిశోధకులు

లండన్, అక్టోబర్ 16: మూడు పురుషాంగాలతో ఓ వ్యక్తి జీవించినట్టు యూకేలోని బర్మింగ్‌హామ్ మెడికల్ స్కూల్‌కు చెందిన వైద్య విద్యార్థులు గుర్తించారు. 78 ఏండ్ల సదరు వ్యక్తి మరణించిన తర్వాత తన మృతదేహాన్ని పరిశోధనలకు దానంగా ఇచ్చారు. ఆయన మృతదేహంపై పరిశోధనలు చేస్తున్న విద్యార్థులు అతడికి మూడు పురుషాంగాలు ఉన్నట్టు గుర్తించారు. అత్యంత అరుదైన ఈ సమస్యను ట్రిఫాల్లియా అంటారు. ఈ వ్యక్తికి ఒక పురుషాంగం బయటకు ఉండగా, అదనంగా ఉన్న రెండు పురుషాంగాలు బీజకోశంలో ఉన్నాయని విద్యార్థులు తెలిపారు. అదనపు పురుషాంగాల గురించి అతడికి తెలిసి ఉండదని వీరు భావిస్తున్నారు. ఈ సమస్య ఉన్న వారిలో మూత్రనాళ ఇన్ఫెక్షన్లు, అంగస్తంభన లోపం, సంతానలేమి వంటి సమస్యలు వస్తాయని వైద్యులు చెప్పారు. ఇంతకుముందు 2020లో ఇరాక్‌లోని దుహోక్‌లో ఓ మూడు నెలల బాలుడిలో ఈ సమస్యను గుర్తించారు. పెద్దవారిలో గుర్తించడం మాత్రం ఇదే మొదటిసారి.


# కంటి స్కాన్‌తో డయాబెటిస్ నిర్ధారణ!



వాషింగ్టన్: మనిషి కండ్లను చూసి అతనికున్న వ్యాధులను నిర్ధారించవచ్చంటున్నారు అమెరికాకు చెందిన పలు యూనివర్సిటీల పరిశోధకులు. వివిధ రకాల వ్యాధుల ప్రాథమిక దశను కంటి చూపులోనే తెలుసుకోవచ్చని చెప్తున్నారు. మధుమేహం, గుండె జబ్బులు, కిడ్నీ వైఫల్యం, రక్తహీనత, అల్జీమర్స్ వంటి వ్యాధులు సంబంధించిన ఆధారాలు కంటి స్కాన్ ద్వారా కనుగొనవచ్చని పేర్కొంటున్నారు. కంటిలో జరిగే సూక్ష్మమైన మార్పులను బట్టి వారి ఆరోగ్య సమస్యలను తెలుసుకోవచ్చని తెలిపారు. ఆ సూక్ష్మమైన మార్పులను గుర్తించే అధునాతన ఆప్తాల్మోస్కోప్‌ను (కనుపాప లోపలి భాగాన్ని పరిశీలించే పరికరం) అభివృద్ధి చేసేందుకు పరిశోధకులు ప్రయత్నిస్తున్నారు.దీనిని రూపొందించేందుకు పరిశోధకులు 2000 సంవత్సరం నుంచి ప్రయత్నిస్తున్నారు. ఆప్తాల్మోస్కోప్ కంటి వెనుకభాగాన్ని పరిశీలించగలదు. ఆ భాగంలోని ఎర్ర రక్త కణాల కదలికలను వీరు ఆ పరికరం సాయంతో చూడగలిగారు. డయబెటిస్, హైపర్‌టెన్షన్‌కు సంబంధించిన బయోమార్కర్లను వీరు కంటి రక్తనాళాల్లో గుర్తించగలిగారు. మరోవైపు నార్త్‌వెస్టర్న్, మౌంట్ సీనాయి, స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీల పరిశోధకులు ఆప్తాల్మోస్కోపిక్ పరిజ్ఞానంతో కంటిలోని వివిధ భాగాలపై పరిశోధన సాగిస్తున్నారు. ఈ పరిజ్ఞానంతో వారు సికిల్‌సెల్ అనీమియాను గుర్తించగలిగారు.

## ప్రపంచంలోనే అతిచిన్న వాషింగ్ మెషీన్

### భారతీయుడి గిన్నిస్ రికార్డు



న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతి చిన్న వాషింగ్ మెషీన్‌ను తయారుచేసిన భారతీయుడు సెబిన్ సాజి గిన్నిస్ బుక్‌లో చోటు సంపాదించుకున్నాడు. మామూలు వాషింగ్ మెషీన్‌లానే పనిచేసే ఈ వాషింగ్ మెషీన్ కొలతలు 1.28/ 1.32, 1.52 అంగుళాలు మాత్రమే. 1990లలో గిన్నిస్‌లో చోటు సంపాదించుకున్న పాపులర్ హ్యాండ్‌హెల్డ్ టాయ్ అయిన తమగోచి డిజిటల్ పెట్ రికార్డును ఈ వాషింగ్ మెషీన్ తుడిచిపెట్టేసింది. సాజి రూపొందించిన వాషింగ్ మెషీన్ ప్రపంచంలోనే అతి చిన్నదని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ గుర్తించింది. ఇందుకు సంబంధించిన వీడియోను పంచుకుంది. సాజి ఆ మెషీన్‌లో చిటికెడ్ వాషింగ్ పౌడర్ వేయడం, ఆ వెంటనే అది నీళ్లు తీసుకోవడం వంటివి ఆ వీడియోలో ఉన్నాయి. కాగా, ఇటీవల ప్రపంచంలోనే అతి చిన్న వ్యాక్యూమ్ క్లీనర్‌ను కూడా భారతీయుడే రూపొందించాడు. ఇది కేవలం 0.65 సెంటీమీటర్లు మాత్రమే ఉంది.

## జాన్సన్ అండ్ జాన్సన్‌కు రూ.126 కోట్ల జరిమానా

న్యూఢిల్లీ: ప్రముఖ హెల్త్‌కేర్ సంస్థ జాన్సన్ అండ్ జాన్సన్‌కు భారీ షాక్ తగిలింది. దశాబ్దాలుగా ఆ సంస్థకు చెందిన పౌడర్‌ను వాడటం వల్ల తనకు క్యాన్సర్ వచ్చిందంటూ ఒక వ్యక్తి వేసిన దావాకు స్పందించిన ట్రయల్ కోర్టు నష్టపరిహారంగా సుమారు రూ.126 కోట్లు అతడికి చెల్లించాలని తీర్పు చెప్పింది. కంపెనీకి చెందిన బేబీ పౌడర్ వల్ల తనకు ఈ వ్యాధి వచ్చిందని ప్లాటికిన్ ఇవాన్ అనే వ్యక్తి 2021లో దావా వేశారు.